సాక్షి వికారాబాద్
శుక్రవారం । 5 । మే । 2023



భక్తుల కొంగు బంగారం..
తాండూరు మండలంలోని కోత్లాపూర్‌లో కొలువుదీరిన రేణుక ఎల్లమ్మ భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. 8లో▸



దక్కని పింఛన్లు
డయాలసిస్ పేషెంట్లకు పింఛను అందక అవస్థలు పడుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో 59 మంది చికిత్స పొందుతున్నారు. 8లో▸



సబ్‌స్టేషన్ ఏర్పాటు కలేనా!
ప్రతి రెండు, మూడు గ్రామాలకు ఒక సబ్‌స్టేషన్ ఏర్పాటు కలగా మారింది. ఓవర్‌లోడ్‌తో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. 9లో▸

న్యూస్‌రీల్

బదిలీ కావాలా?.. దరఖాస్తు చేసుకోండి

వికారాబాద్ అర్బన్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది కోరుకున్న పాఠశాలలకు బదిలీ అయ్యేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర పాఠశాలల విద్య సంచాలకుల ఆదేశానుసారం ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకోసం జీసీడీఓను సంప్రదించాలని డీఈఓ పేర్కొన్నారు.

జేపీఎస్‌ల వినూత్న నిరసన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ముగ్గులు వేసి నిరసన చేపడుతున్న జేపీఎస్‌లు

తాండూరు రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె గురువారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు వినూత్న నిరసన చేపట్టారు. సమ్మె చేస్తున్న ప్రాంతంలో ముగ్గులు వేశారు. అలాగే చేతులకు మెహిందీ వేసుకుని నిరసనకు దిగారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేపీఎస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ జారీ

కొడంగల్ రూరల్ : కొడంగల్ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గానికి సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాస్ తెలిపారు. ఏఎంసీ చైర్మన్‌గా భైరెడ్డి సుజాతరెడ్డి, వైస్ చైర్మన్‌గా ర్యాలపేట వాణీశ్రీ, సభ్యులుగా కోస్గి మధుసూదన్‌రెడ్డి, ఎం.విజయకుమార్, గౌని రామకృష్ణారెడ్డి, నాయికోటి భానుప్రకాశ్, ఎం.నాగరాణి, మహ్మద్ పరీద్, పోల్యా సోమ్‌నాథ్, బాకారం అరుణ్‌కుమార్, లచ్చప్ప, రాఘవపురం వీరభద్రప్ప, ఎస్‌ఎం.శ్రీదేవి, ఆవుటి కౌసల్యలతోపాటు మరో నలుగురు సభ్యులతో త్వరలో పాలక వర్గ ప్రమాణ స్వీకారం ఉంటుందని పేర్కొన్నారు.

అండగా ఉంటాం

ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్



పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న బల్మూరి వెంకట్

షాద్‌నగర్‌రూరల్: పంచాయతీ జూనియర్ కార్యదర్శులను పర్మినెంట్ చేయకపోతే పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును అడ్డుకుంటామని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ హెచ్చరించారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె చేపడుతున్నారు. సమ్మెకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగేళ్ల గడువు పూర్తయినప్పటికీ పంచాయతీ జూనియర్ కార్యదర్శుల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోవడం బాధాకరమని అన్నారు. రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరితో రాష్ట్రంలో సుమారు 9వేలమంది పంచాయతీ కార్యదర్శులకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. పంచాయతీ కార్యదర్శుల పక్షాన పోరాటం చేస్తామన్నారు.



మొరంగపల్లిలో ఊరడమ్మ దేవాలయానికి బోనాలతో తరలివస్తున్న మహిళలు

ఊరడమ్మకు బోనాలు

మోమిన్‌పేట మండలం మొరంగపల్లిలో గురువారం బోనాలు వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవత ఊరడమ్మకు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. స్థానిక హనుమాన్ ఆలయంలో ధ్వజ స్తంభం స్థాపన జరిగిన మరునాడు అమ్మవారికి బోనాలు తీశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని అమ్మవారిని కోరుకున్నారు.

– మోమిన్‌పేట

ముంచుతోంది..బెట్టు

ఐపీఎల్.. ఇప్పుడు ఎవరి నోట విన్నా ఇదే మాట. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా అందరూ చర్చించుకుంటున్న ఆట క్రికెట్. మరోవైపు అంతేవేగంగా క్రికెట్ బెట్టింగ్ జరుగుతోంది. గతంలో యువత, పలువురు ఉద్యోగులు, నాయకులకే పరిమితమైన ఈ బెట్టింగ్ ఇప్పుడు విద్యార్థుల వరకూ పాకింది. తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీ సైతం బెట్టింగులకు వెచ్చిస్తున్నారు. సరదాగా ప్రారంభమై చివరకు ఊబిలోకి దిగిపోతున్నారు. ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన యువత బెట్టింగ్ ఉచ్చులో చిక్కుకుంటోంది.

ఐపీఎల్ హోరు.. బెట్టింగ్‌ల జోరు
- ఉచ్చులో యువత
- విద్యార్థులు సైతం అదే దారిలో..
- అడ్డాలుగా మారుతున్న శివారులు
- వాట్సాప్ కాల్స్ ఆధారంగా పందేలు



వందల సంఖ్యలో యువత

వికారాబాద్: ఇప్పటికే గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారిన పడి కొట్టుమిట్టాడుతున్న యువత ఇప్పుడు బెట్టింగ్ వంటి వ్యసనాల ఊబిలో కూరుకుపోతోంది. చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ.. పైసాపైసా కూడబెట్టిన డబ్బును యువకులు బెట్టింగుల పాల్జేస్తున్నారు. ఐపీఎల్ కొనసాగుతున్న నేపథ్యంలో కొందరు చూస్తూ ఎంజాయ్ చేస్తుంటే మరికొందరు బెట్టింగులతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఇంకొందరైతే ఏకంగా నగలు సైతం తాకట్టు పెట్టే స్థాయికి దిగజారుతున్నారు. గంజాయికి అలవాటు పడిన యువతే ఈ బెట్టింగులలో ఎక్కువ పాల్గొంటున్నట్టు సమాచారం. బెట్టింగులకు పాల్పడితే తాట తీస్తామని గతంలో పోలీసు లు హెచ్చరికలు చేసినప్పటికీ ఏ మాత్రం ఆగటం లేదు... గుట్టుగా వ్యవహారం కొనసాగిస్తున్నారు.

గతంలో అడపాదడపా ఇండియా మ్యాచ్‌లు జరిగే సమయంలో క్రికెట్ బెట్టింగ్‌లు జరిగేవి. ప్రస్తుతం కొనసాగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నేపథ్యంలో ఊపందుకున్నాయి. ఒక్కో మున్సిపాలిటీ పరిధిలో రెండు మూడు వందలకు పైగా యువకులు, ఉద్యోగులు పలువురు నాయకులు బెట్టింగుల్లో పాలు పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. మ్యాచ్ మ్యాచ్‌కు లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం. బెట్టింగ్ ఉచ్చులో పడి యువకులు ప్రాణాల మీదకు తెచ్చుకోకముందే పోలీసులు నిఘా పెంచాలని పలువురు కోరుతున్నారు. పాఠశాల వయసున్న చిన్నారులు సైతం రూ.10 మొదలుకుని 100 వరకు బెట్‌లు కడుతుండటం గమనార్హం.

కోడ్‌ల ఆధారంగా..

ప్రధానంగా క్రికెట్ బెట్టింగ్.. రెండు తరహాల్లో సాగుతోంది. కొందరు యువకులు స్థానికేతరులతో సంబంధాలు ఏర్పరుచుకుని ఆన్‌లైన్ ద్వారా ఫోన్ సాయంతో బెట్టింగులకు పాల్పడుతున్నారు. ఇందుకోసం వన్ ఎక్స్, బెట్‌వే, పెట్‌వే లాంటి యాప్‌లను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరు స్థానికంగానే గ్రూపులుగా మారి ఆడుతున్న జట్లపై పందెం కాస్తున్నారు. ఒక్కొక్కరు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు బెట్టు కాస్తున్నారు. ఇందులో నాయకులు, రియల్టర్లు వంటి వారు రూ. లక్షల్లో బెట్ కడుతున్నట్లు ప్రచారం. బెట్టు కాసే సమయంలో ఎవరికీ అనుమానం రాకుండా కోడ్‌లను వినియోగిస్తున్నారు.. ఈ తతంగం ఎవరూ గమనించకుండా వాట్సాప్ కాల్స్, వాట్సప్ మెసేజీల ద్వారా సమాచార మార్పిడి చేస్తూ బెట్టింగులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మరికొందరు వికారాబాద్ వారు పరిగి వారితో, తాండూరు వాళ్లతో, ఇలా ఒక్కో ప్రాంతం వారు మరో ప్రాంతం వారితో బెట్టింగులు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.

గ్రూపులుగా ఏర్పడి..

గ్రూపులుగా ఏర్పడిన యువకులు పలు అడ్డాలు ఏర్పాటు చేసుకుని పందేలకు పాల్పడుతున్నారు. గ్రామాల నుంచి కూడా కొందరు యువకులు ఈ జూదంలో పాల్గొనేందుకు వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ వంటి పట్టణాలకు వస్తున్నట్లు సమాచారం. టీ పాయింట్లు, హోటళ్లు, పట్టణాలకు కాస్త దూరంగా ఉండే వెంచర్లు, పాన్‌షాప్‌లు కొత్తగా ఏర్పడిన ఛాయ్ చస్కాలు, బేకరీలు అడ్డాలుగా మారుతుండటం గమనార్హం.



మెట్లకుంట గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కొనుగోళ్లు షురూ..

- గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

బొంరాస్‌పేట : మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'కొనుగోళ్ల జాడేది?' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఐకేపీ, వ్యసాయాధికారులు, రైతు సమన్వయ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. బొంరాస్‌పేట మండలంలోని ఏర్పుమళ్ల, మెట్లకుంట తదితర గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏ గ్రేడ్‌కు క్వింటాలు ధర రూ.2060, సాధారణ గ్రేడ్ ధాన్యాన్ని రూ.2040కి కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తూనికల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా కొనుగోళ్లు చేస్తున్నట్లు రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందవచ్చని సూచించారు. శుక్రవారం మిగతా గ్రామాల్లోనూ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు కోట్ల యాదగిరి, రాములునాయక్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, ఐకేపీ సిబ్బంది, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం సేకరించండి

- రైతులకు ఇబ్బందులు రావొద్దు
- ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ శర్మ



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పకడ్బందీగా ధాన్యాన్ని సేకరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. వరి ధాన్యం సేకరణపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఇన్‌చార్జిలుగా ఉన్న అధికారులు రైతుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జిల్లా ఉన్నత స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయికి వెళ్లి పర్యవేక్షించాలని సూచించారు. సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లర్లకు చేరవేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, తేమ యంత్రాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. అవసరమైనన్ని గన్ని బ్యాగులను సైతం అందుబాటులో ఉంచాలన్నారు. బాధ్యతారహితంగా ఉన్న అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ విమల, డీఆర్‌డీఓ కృష్ణన్, వ్యవసాయ అధికారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏకమైతేనే రాజ్యాధికారం

- బహుజనులు సంఘటితం కావాలి
- బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్
- పార్టీలో చేరిన పలువురు మైనార్టీ నాయకులు



బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సమక్షంలో చేరిన పలువురు మైనార్టీలు

తాండూరు టౌన్: సమాజంలో అసమానతలు తగ్గాలంటే బహుజన రాజ్యాధికారం రావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. గురువారం బీఎస్పీ తాండూరు పట్టణాధ్యక్షుడు అకీల్ బాబా ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు పార్టీలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని, ఆర్థికాభివృద్ధిని విస్మరించాయన్నారు. నిత్యావసర ధరలు ఇష్టానుసారంగా పెరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. రాబోయే ఎన్నికల్లో తాండూరులో బహుజనులంతా బీఎస్పీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. మజార్, మక్సూద్, అశ్వాక్, వాసిమ్ లతో పాటు పలువురు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు అమ్జద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు సమైక్యతా భావాన్ని పెంపొందిస్తాయి

క్రీడలు యువతలో సమైక్యతా భావాన్ని పెంపొందిస్తాయని బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన పాతతాండూరులో బీఎస్పీ వారియర్స్ జట్టు, ఐసీఎల్11 జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌ను తిలకించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు యువతను సంఘటితం చేస్తాయన్నారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి సత్యమూర్తి పాల్గొన్నారు.

'జంగ్ సైరన్'ను జయప్రదం చేయండి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

హుడాకాంప్లెక్స్: పీసీసీ ఆధ్వర్యంలో ఈ నెల 8న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే విద్యార్థి నిరుద్యోగ జంగ్ సైరన్ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ హాజరవుతారని తెలిపారు. గురువారం సభకు సంబంధించిన ఏర్పాట్లను ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేశ్‌నేత, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీ టార్పాలిన్లు ఏమాయె!

- 2018 నుంచి పంపిణీ నిలిపివేత
- బహిరంగ మార్కెట్లో అధిక ధరలు
- ధాన్యం కాపాడుకునేందుకు నానాపాట్లు



సొంతంగా కొనుగోలు చేసి ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు

దౌల్తాబాద్: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు అన్నదాతలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొద్దికాలంగా వరుణుడు నిత్యం పలకరిస్తుడటం..ధాన్యం తడుస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. పంటను రక్షించుకుందామంటే రైతుల వద్ద టార్పాలిన్లు అందుబాటులో లేవు. ఐదు సంవత్సరాల నుంచి ప్రభుత్వం సబ్సిడీ టార్పాలిన్ల పంపిణీ నిలిపివేసింది. దీనికి తోడు బహిరంగ మార్కెట్లో టార్పాలిన్లు అధిక ధరలకు అమ్ముతుండడంతో వాటిని కొనలేక కొంతమంది రైతులు ఎరువుల బస్తాలతో పట్టాలు కుట్టించుకుని ధాన్యం తడవకుండా కాపాడుకుంటున్నారు.

ఐదేళ్లుగా ఎదురుచూపులు

మండలంలో యాసంగి సీజన్‌లో 12వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. చాలా గ్రామాల్లో ఇప్పటికే వరి కోతలు పూర్తవుతున్నాయి. వరిధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తరలించారు. పంట కోతలు ఆరబెట్టే సమయాల్లో రైతులకు టార్పాలిన్లు అవసరం ఎక్కువగా ఉంటుంది. అకస్మాత్తుగా వర్షం వస్తే ధాన్యం పాడవకుండా ఇవి ఉపయోగపడతాయి. 2023 వరకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందించేది. రైతులు కూడా వాటిని తీసుకోవడానికి పోటీ పడేవారు. ప్రతిసారి ఆశించిన మేర టార్పాలిన్లు రాకపోవడంతో ఉన్నంత మేరలో అధికారులు రైతులకు అందించేవారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వం టార్పాలిన్లు పంపిణీ నిలిపివేసింది.

నాణ్యతతోపాటు..

ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసే టార్పాలిన్లు నాణ్యతతో పాటు ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. వీటికి 50శాతం రాయితీ ప్రభుత్వం భరిస్తుంది. ఒక్కో టార్పాలిన్‌కు రైతు తనవంతుగా వాటా రూ.1250 చెల్లిస్తే ప్రభుత్వం రూ.1250 చెల్లిస్తుంది. అదే ప్రైవేట్‌గా కొనుగోలు చేసిన టార్పాలిన్లు అంత నాణ్యతగా ఉండవు. అవి కూడా రూ. 2500 నుంచి రూ.3వేల వరకు విక్రయిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ప్రస్తుతం వరి పంట కోతకు వచ్చింది. కొద్ది రోజులుగా వర్షం పడుతోంది. పంట కోస్తే ధాన్యం ఆరబెట్టడానికి టార్పాలిన్లు లేవు. సబ్సిడీపై ఇస్తలేరు. మార్కెట్లో రూ.2500 అంటున్నారు. ఏమి చేయాలో తోచడంలేదు. – బసయ్య, రైతు, దౌల్తాబాద్

ఆదేశాలు రాలేదు



సబ్సిడీ టార్పాలిన్లపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేవు. సబ్సిడీపై వస్తే వాటిని రైతులకు అందజేస్తాం. సమాచారం అందిస్తాం.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

దళితబంధులో కమీషన్ల దందా

- ఎమ్మెల్యే అనుచరుల ఇష్టారాజ్యం
- మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, బీఆర్‌ఎస్ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, బీఆర్‌ఎస్ నాయకులు

తాండూరు: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అనుచరులు దళిత బంధు పథకంలో ఇష్టారాజ్యంగా కమీషన్లు దండుకుంటున్నారని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, బీఆర్‌ఎస్ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి నివాసంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంతో పట్నం మహేందర్‌రెడ్డిపై ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 25 ఏళ్ల తాండూరు ప్రాంతాన్ని మరుగుజ్జు అభివృద్ధి చేయలేదని ఎమ్మెల్యే ఆరోపించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. మహేందర్‌రెడ్డిని విమర్శిస్తే సీఎం కేసీఆర్ పాలనను విమర్శించినట్టేనని వారు అన్నారు. ఎమ్మెల్సీ పాతికేళ్లుగా తాండూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. ప్రతి గ్రామానికి రోడ్డు వేసిన ఘనత పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డికే దక్కుతోందన్నారు. గ్రామాలలో అంగన్‌వాడీ భవనాలు, వాటర్ ట్యాంక్‌లు, పాఠశాల భవనాలు, రైల్వే బ్రిడ్జి, కాగ్నానదిపై వంతెనల నిర్మాణాలు చేపట్టారన్నారు. ఇన్ని అభివృద్ధి పనులు చేసిన మహేందర్‌రెడ్డిని విమర్శించడం సరి కాదన్నారు. సొంత పార్టీ నాయకులను విమర్శించడం సరికాదని హితవుపలికారు. అధికార పార్టీలో ఉన్నా కూడా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మున్సిపాలిటీకి మూడేళ్లుగా కమిషనర్ లేకుండా చేశారని చైర్‌పర్సన్ మండిపడ్డారు. పార్టీ ప్రతిష్టను దిగజార్చేలా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోయిన నగలు బాధితురాలి చెంతకు..

3గంటల్లో అందజేసిన పోలీసులు



బాధితురాలి సోదరుడికి ఆభరణాలు అందజేస్తున్న ఎస్‌ఐ మన్మథకుమార్

అబ్దుల్లాపూర్‌మెట్‌: శుభకార్యానికి హాజరైన ఓ మహిళ బ్యాగులోంచి పోయిన 16తులాల బంగారు ఆభరణాలు పోలీసుల చొరవతో బాధితురాలికి అందాయి. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరుకు చెందిన వెంకటరత్నమ్మ అబ్దుల్లాపూర్‌మెట్‌లోని మినీ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన బంధువుల శుభకార్యానికి హాజరయ్యారు. కార్యక్రమం ముగియడంతో ఊరికి బయలుదేరింది. ఈ క్రమంలో తన బ్యాగులో ఉంచిన 16 తులాల బంగారు ఆభరణాలను చూసుకోగా కనిపించలేదు. దీంతో పరిసరాల్లో వెతికింది. కనిపించకపోవడంతో బాధితురాలి సోదరుడు చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ వెంకటరాంరెడ్డి, సిబ్బంది రమణ, శ్రీధర్, రాజులు ఘటనా స్థలానికి చేరుకొని అక్కడి సీసీ కెమెరాలను పరిశీలించారు. ఫంక్షన్ హాల్‌లో ఒక చోట నగలు లభ్యమయ్యాయి. వాటిని పోలీసులు బాధితురాలి సోదరుడికి అందజేశారు. దీంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోండి

లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

షాద్‌నగర్ రూరల్: మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి బైపాస్ సమీపంలో గల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని, ఈ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చటాన్‌పల్లి వద్ద మున్సిపాలిటీకి చెందిన 3,630 గజాల స్థలం ఉందని, దాన్ని కొందరు ఆక్రమించారని తెలిపారు. స్థలం విలువ కోట్లల్లో ఉంటుందని అన్నారు. భూ కబ్జాపై ఇటీవల హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. విచారణ జరిపి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రైల్వే పార్కింగ్‌లో బైక్ చోరీ

శంకర్‌పల్లి: స్థానిక రైల్వేస్టేషన్ పార్కింగ్‌లో ఉంచిన బైక్‌ను గుర్తుతెలియని దొంగలు అపహరించుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి సాయినగర్ కాలనీకి చెందిన పరమేశ్వర్ బుధవారం ఉదయం శంకర్‌పల్లి రైల్వే పార్కింగ్‌లో తన బైక్‌ను పార్క్ చేసి లక్డీకపూల్‌లో గల డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో విధులకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో గురువారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'ఉపాధి' కూలీలకు బకాయిలు చెల్లించండి

షాద్‌నగర్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం చింతోడ్ గ్రామంలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం శ్రీనునాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధి కూలీలకు పనికి సరిపడా వేతనం ఇవ్వడం లేదన్నారు. ప్రతి కూలీకి రోజుకు ఆరు వందలు ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఉపాధి హామీ పథకానికి ప్రతి ఏటా బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తోందని అన్నారు. కొలతలతో సంబంధం లేకుండా కూలీ డబ్బులు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దాస్యనాయక్, లక్ష్మణ్ నాయక్, శంకర్, గోపాల్, శ్రీను, మల్లేష్, చంద్రమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం..



మూలవిరాట్టు



ముస్తాబైన రేణుక ఎల్లమ్మ ఆలయం

కోత్లాపూర్ రేణుక ఎల్లమ్మ

- నేటి నుంచి నెలరోజుల పాటు జాతర
- 19న అమ్మవారి రథోత్సవం, సిడే
- కర్ణాటక, మహారాష్ట్ర తోపాటు తెలంగాణ జిల్లాల నుంచి భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

తాండూరు రూరల్: మండలంలోని కోత్లాపూర్‌లో కొలువుదీరిన రేణుక ఎల్లమ్మ భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. అమ్మవారి జాతర ఈ నెల 5నుంచి జూన్ 4వ తేదీ వరకు నెల రోజుల పాటు జరగనున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర తోపాటు తెలంగాణలోని పలు జిల్లాల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఆలయం తెలంగాణ – కర్ణాటక సరిహద్దులో ఉండడంతో ప్రతి శుక్ర, మంగళ వారాల్లో భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.

ఆలయ చరిత్ర

కోత్లాపూర్ ఎల్లమ్మ ఆలయానికి 850 సంవత్సరాల చరిత్ర ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామానికి చెందిన రాళ్ల రాగిరెడ్డి తన పొలాన్ని చదును చేస్తుండగా గుంటుకకు ఓ రాయి అడ్డు వచ్చింది. దాన్ని తీసి గుంటుక మీద పెట్టి పొలాన్ని చదును చేయడం ప్రారంభించాడు. రాయి తిరిగి తన స్థానంలోకి వెళ్లింది. ఇలా రెండు పలుసార్లు జరిగింది. తదనంతరం రాగిరెడ్డికి ఎల్లమ్మ తల్లి కలలో వచ్చి అది నేనే అక్కడ గుడి కట్టాలని చెప్పింది. దీంతో రాగిరెడ్డి చిన్నపాటి గుడి నిర్మించారు. ఆ తర్వాత ఆలయం దినదినాభివృద్ధి చెందింది. ఆలయాన్ని కర్ణాటకకు చెందిన మంత్రి అరవింద్ లింబావళికి అభివృద్ధి చేశారు. ఎల్లమ్మ ఇంటి దేవత కావడంతో మంత్రి ప్రతి సంవత్సరం కోత్లాపూర్‌కు వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా మారింది. అమ్మవారి దయతోనే తాను రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగినట్లు ఆయన చెబుతుంటారు. కొన్ని నెలల క్రితం గుడి మొత్తం రంగులు వేయించారు. 2001లో ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోని వెళ్లింది. అప్పటి నుంచి వివిధ దశల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

19న రథోత్సవం...

ఈ నెల 5వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ అంటే మొలకల పౌర్ణమికి జాతర ప్రారంభమై.. ఎరువాక పౌర్ణమి వరకు జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 19న అమ్మవారి రథోత్సవం, సిడే కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

భక్తుల కోర్కెలు తీరుతాయని నమ్మకం

భక్తుల కోర్కెలు తీర్చే మహిమగల దేవత ఎల్లమ్మ తల్లి అని భక్తుల నమ్మకం. జాతరకు దాదాపు 5వేల మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుంటారు. అమ్మవారిని బోనంతో పాటు నైవేద్యాలు సమర్పిస్తారు. నూతన దంపతులు ఆలయంలో ఒడి బియ్యం పోసుకొని అమ్మవారిని దర్శించుకుంటారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు



జాతరకు వేల సంఖ్యలో భక్తులు వస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. వంట చేసుకోవడానికి ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేశాం. తాగునీటి వసతి ఉంది. వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజీలు నిర్మించాం. గ్రామస్తుల సహకారంతో జాతరను వైభవంగా నిర్వహిస్తాం.

– సందీప్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

ప్రతి రైతుకూ సంక్షేమ ఫలాలు

- అదే సహకార సంఘం లక్ష్యం
- డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి



రైతులకు గోడ గడియారాలు అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: ప్రతి రైతు కుటుంబానికీ సంక్షేమ పథకాల ఫలితాలు అందించాలన్న తలంపుతో సహకార సంఘాలు పని చేస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ బీ మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం చౌడాపూర్ మండలం భజ్యానాయక్ తండా సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులకు గడియారాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ పరిధిలోని రైతులతో మాట్లాడి వ్యవసాయ సంబంధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ అభ్యున్నతికి మొదటి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తాము సైతం రైతులకు విరివిగా రుణాలను ఇస్తున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, సీఈఓ బక్కారెడ్డి, సర్పంచ్ శోభ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాంలాల్, నాయకులు మొగులయ్య, శ్రీను పాల్గొన్నారు.

ముగ్గులు వేసి జేపీఎస్‌ల నిరసన

- వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్
- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

అనంతగిరి: జేపీఎస్, ఓపీఎస్‌లను వెంటనే క్రమబద్ధీకరించాలని జేపీఎస్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పంచాయతీ జూనియర్ కార్యదర్శులు చేపడుతున్న సమ్మె గురువారానికి 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మహిళా జేపీఎస్‌లు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని విన్నవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం మా డిమాండ్లను తీర్చాలని విన్నివించారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ప్రతినిధి ఉప్పరి ప్రసాద్ సమ్మెకు సంఘీభావం తెలిపి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి అజ్మత్ సంఘీభావం తెలిపారు.



వికారాబాద్‌లో ముగ్గులు వేస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌లు



హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో బుధవారం జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో భాగంగా హైబిజ్ టీవీ మీడియా పురస్కారాన్ని హోంమంత్రి మహమూద్‌అలీ, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి చేతుల మీదుగా అందుకుంటున్న సాక్షి ప్రకటనల విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పొట్టిగారి కృష్ణారెడ్డి

డయాలసిస్ పేషెంట్లకు దక్కని పింఛన్లు

- 8 నెలలుగా ఎదురు చూపులు
- నగం మందికి పైగా రాని వైనం
- ఆదుకోవాలని వేడుకోలు



తాండూరు జిల్లా ఆస్పత్రిలో డయాలసిస్ పేషెంట్లు

తాండూరు టౌన్: డయాలసిస్ పేషెంట్లకు పింఛను అందక అవస్థలు పడుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో 59 మంది డయాలసిస్ పేషెంట్లు వైద్యం పొందుతున్నారు. ఒక్కో పేషెంట్‌కు ప్రతి నెలా రూ. 2,016 పింఛను ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే 59 మందికి గాను 21 మందికే పింఛన్లు వస్తున్నాయి. మిగిలిన 38 మందికి పింఛను రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. 8 నెలల క్రితం ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించింది. అప్పట్లో 38 మంది డయాలసిస్ పేషెంట్లు దరఖాస్తులు చేసుకున్నారు. కానీ మంజూరు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. చాలామంది రోగులు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు కావడం, వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చేందుకు కూడా ఆర్థిక ఇబ్బందులు పడేవారే అధికంగా ఉండడంతో పింఛన్ల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. వారంలో మూడు సార్లు గ్రామాల నుంచి రవాణా ఛార్జీలు పెట్టుకుని జిల్లా ఆస్పత్రికి రావాల్సి ఉంటుంది. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారు ఏ పనీ చేయలేరు. నెలకు సగటున ఒక్కో వ్యక్తికి రూ. 4వేల వరకు రవాణా, తదితర ఖర్చులు వస్తుంటాయి. అప్పుల చేసి వైద్యం చేయించుకుంటున్న వారు ఉన్నారు. అలాగే జిల్లా ఆస్పత్రిలో నెఫ్రాలజిస్ట్ వైద్యున్ని నియమించాలని కోరుతున్నారు. నెఫ్రాలజిస్ట్ వైద్యుడు లేకపోవడంతో పరీక్షల కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలా నెలా పింఛను వస్తే కనీస అవసరాలకు సరిపోతాయని, ప్రభుత్వం ఆదిశగా చొరవ తీసుకోవాలని వారు కోరుతున్నారు.

8 నెలల క్రితం దరఖాస్తు చేశా



కిడ్నీ సంబంధిత వ్యాధి రావడంతో ఏ పనీ చేయలేకపోతున్నా. కుటుంబాన్ని పోషించడం కష్టంగా మారింది. వారంలో మూడుసార్లు ఆస్పత్రికి పోవాల్సి ఉంది. రానుపోను చార్జీలు, ఇతర ఖర్చులకు ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం పింఛను మంజూరు చేసి ఆదుకోవాలి.

– వెంకటయ్య, బండపల్లి

ఆర్థికంగా ఆదుకోవాలి



ఏ పని చేసినా నీరసించి పోయే ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నా. పేదరికంలో ఉన్న మాలాంటి రోగులు వైద్యం కోసం మరింత చితికి పోతున్నాం. 8 నెలల క్రితం కొత్త పింఛన్లు ఇస్తామని ప్రకటించారు. కానీ మంజూరు కాలేదు. వెంటనే పింఛను మంజూరు చేసి ఆదుకోవాలి.

– వెంకట్‌రెడ్డి, బాలంపేట్

నేరస్తులకు శిక్ష పడాలి

- ఆ దిశగా సిబ్బంది ముందుకు సాగాలి
- ఎస్పీ కోటిరెడ్డి
- గ్రేవ్ కేసులపై ప్రత్యేక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ఎస్సీ, ఎస్టీ, పోక్సో, హత్య తదితర గ్రేవ్ కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ కోటిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం గ్రేవ్ కేసులపై జిల్లాలోని డీఎస్పీలు, సీఐలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు తమ పీఎస్ పరిధిలోని పెండింగ్ కేసుల శాతాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో కేసుల వివరాలు నమోదు చేయాలన్నారు. పోలీసు సిబ్బందితో పీఎస్‌ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని కేసులపై చర్చించాలన్నారు. ఎప్పటికప్పుడు కోర్టు సిబ్బందికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. సీసీటీవీలు పని చేయకుంటే వెంటనే మరమ్మతుల చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీలు సత్యనారాయణ, కరుణసాగర్, శేఖర్‌గౌడ్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మా కోటా బియ్యం ఏమయ్యాయి?

- ఇన్‌చార్జ్ డీలర్‌ను నిలదీసిన గుండాల గ్రామస్తులు
- రేషన్ షాపు వద్ద ఆందోళన



రేషన్ షాపు వద్ద ఆందోళనకు దిగిన గ్రామస్తులు

దోమ: గ్రామంలోని లబ్ధిదారులకు సరిపడా రేషన్ బియ్యం వచ్చినప్పుడే మాకు ఎందుకు ఇవ్వడం లేదని గుండాల గ్రామస్తులు రేషన్ డీలర్‌ను నిలదీశారు. రేషన్ డీలర్ సుజాత సర్పంచ్‌గా ఎన్నిక కావడంతో అప్పటి నుంచి ఇన్‌చార్జ్ డీలర్లతో రేషన్ సరఫరా చేస్తున్నారు. గురువారం రేషన్ దుకాణం తెరవడంతో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కేవలం 76 క్వింటాళ్ల రేషన్ బియ్యమే వచ్చాయని, కొందరు పక్క గ్రామాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలని ఇన్‌చార్జ్ డీలర్ వెంకటేష్ సూచించడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆగ్రహించిన ప్రజలు మా గ్రామానికి 143 క్వింటాళ్ల రేషన్ బియ్యం రావాల్సి ఉండగా తక్కువ ఎందుకు పంపుతున్నారని ప్రశ్నించారు. పూర్తిస్థాయి కోటా వచ్చిన తరువాతే బియ్యం సరఫరా చేయాలని అప్పటి వరకు ఆపేయాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ షాహేద బేగంను వివరణ కోరగా గ్రామస్తులకు సరిపడా బియ్యం సరఫరా చేస్తామని తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఇబ్రహీంపట్నం రూరల్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యక్తి చనిపోయినట్లు గుర్తించారు. అతని వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, బ్రౌన్ కలర్ ప్యాంట్, ఎత్తు 5.7 అడుగులు ఉంటాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఆదిబట్ల పోలీసులను సంప్రదించాలని కోరారు.

వలస కూలీ ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: వలస కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజబాబు, సుమిరియా దంపతులు. వారి కుమారుడు సుకిత్ యాదవ్‌తో కలసి పట్టణంలోని జీవీకే దేశ్ పౌల్ట్రీ ఫాంలో పని చేస్తున్నారు. పదిహేను రోజుల క్రితం బంధువుల వివాహం కోసం తల్లిదండ్రులు మధ్యప్రదేశ్‌కు వెళ్లారు. సుమిత్ యాదవ్ బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని చనిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మసాజ్ సెంటర్‌పై పోలీసుల దాడులు

షాద్‌నగర్ రూరల్: అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు పట్టణంలోని ఓ మసాజ్ సెంటర్‌పై గురువారం దాడి చేశారు. షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ గురువారం సిబ్బందితో కలపి మహబూబ్‌నగర్ రోడ్డులోని ఫ్రెండ్ ప్రొఫెషనల్ మసాజ్ సెంటర్‌లో తనిఖీలు చేశారు. ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకొని స్టేషన్ తరలించారు. కేంద్రం నిర్వాహకులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



యువతులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొందుర్గు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని రేగడిచిల్కమర్రిలో మైసమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అవాహిత పూజా, చండిహోమం, మంటప హోమాలు, రుద్రహోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తిభావంతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ భక్తిమార్గాన్ని ఎంచుకోవాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు.

ఇళ్లు లేని పేదలు ఉండొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

- ఇదే కేసీఆర్ లక్ష్యం
- సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి
- నందిగామలో 'డబుల్' లబ్ధిదారుల ఎంపికకు లక్కీ డ్రా

నందిగామ: రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు ఉండరాదన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు జిలెల్ల వెంకట్‌రెడ్డి అన్నారు. నందిగామ జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో గురువారం డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపునకు లక్కీ డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నందిగామలో డబుల్ ఇళ్లకు 429 దరఖాస్తులు వచ్చాయని, అందులో 21 డబుల్ ఎంట్రీలను తొలగించారని తెలిపారు. మిగిలిన 408 దరఖాస్తుల్లో సమగ్ర విచారణ జరిపి 120 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. ప్రస్తుతం లక్కీ డ్రా ద్వారా 100 మందికి ఎంపిక చేసి ఇళ్లు కేటాయించినట్లు వివరించారు. మిగతా 20 మంది దరఖాస్తులను పునఃపరిశీలన చేసి అర్హులైన వారికి ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజేశ్వరీ, ఎంపీపీ ప్రియాంక, తహసీల్దార్ రహమాన్ ఖాన్, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు కే కృష్ణ, దేవల్లి కుమార్‌గౌడ్, ఉప సర్పంచ్ ఎం కుమార్ గౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ రాములు పాల్గొన్నారు.